

గుక్కెడు కష్టాలు

పిన్నేపల్లిలో దాహపుకేకలు

- రోజంతా ఎదురుచూసినా నాలుగు బిందెల నీళ్లూ కరువు
- రెండు నెలలుగా ఎద్దడి
- పట్టించుకోని అధికారులు



నీటి కోసం పిన్నేపల్లిలో క్యూలో ఉంచిన బిందెలు



అరకొర నీటి కోసం..





ఈ బిందెలన్నీ ఒకరివే సుమా... నీటి కోసం వృద్ధురాలి అవస్థ

యాడికి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నేపల్లిలో గుక్కెడు నీటి కోసం గుప్పెడు కష్టాలు పడుతున్నారు. నీటి కొరతతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఏ కొళాయి వద్దకెళ్లినా పదుల సంఖ్యలో ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయి. దాహపు కేకలు వినిపిస్తున్నాయి. రెండునెలల నుంచి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెస్తే బోరుబావికి మరమ్మతుల పేరుతో నెలరోజులు కాలయాపన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరమ్మతులు చేసినా.. ఉపయోగం లేకుండా బోరుబావిలో నీరు పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. నీటి సరఫరా కోసం యాడికి నుంచి వెళ్లే పైప్‌లైన్ నుంచి గ్రామానికి కనెక్షన్ ఇచ్చినా ప్రయోజనం లేదని చెబుతున్నారు. నీరు ఏమాత్రం రావడంలేదని తెలిపారు. నీటి సరఫరాలో లోటుపాట్లతోనే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. రోజంతా కొళాయి వద్ద వేచిచూస్తే నాలుగు బిందెల నీళ్ల దొరికేది కష్టమే అని పలువురు తెలిపారు. నీటి కోసం ఇంటికి ఒక వ్యక్తి కొళాయి వద్ద రోజంతా పడిగాపులు కాయాల్సిందేనని తెలిపారు. ఈ సమయంలో అంతా ఉపాధి పనులకు వెళ్తుండడంతో కొళాయిల వద్ద జనం తక్కువగా ఉన్నారనీ, ఉదయం, సాయంత్రం వేళల్లో కొళాయిల వద్ద జనాలు కిక్కిరిసి ఉంటారని తెలిపారు. వేసవి దృష్ట్యా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ఉండుంటే తమకు నీటి సమస్య ఉండేదికాదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో పర్యటించి, నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎదురుచూడాల్సిందే..



గ్రామంలో గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు బిందెల నీరు కావాలంటే రోజంతా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి కోసమే పనులకు వెళ్లకుండా ఒకరు ఇంటివద్ద ఉంటున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామం లో పర్యటించి, నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- ప్రతాప్‌నాయుడు, పిన్నేపల్లి

విచారించి, చర్యలు తీసుకుంటాం



యాడికి గ్రామ పంచాయతీకి చాలినంత నీరు సరఫరా చేస్తున్నాం. పిన్నేపల్లికి యాడికి నుంచి ఇటీవలే పైప్‌లైన్ కనెక్షన్ కూడా ఇచ్చాం. నీటి సరఫరాలో ఎక్కడ అడ్డంకులు ఏర్పడుతున్నాయో విచారిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం. పిన్నేపల్లిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తాం. - వీరరాజు, ఎంపీడీఓ

బజారులో బఫర్ రచ్చ!

- సోషల్ మీడియా వేదికగా వైసీపీ, టీడీపీ విమర్శలు
- పరస్పరం ఫిర్యాదులు
- అధికారులకు తలపోటుగా మారిన వ్యవహారం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బఫర్ బియ్యం వ్యవహారం కంబదూరు మండలంలో రచ్చకెక్కింది. అక్రమాలను ఒకరిపై మరొకరు నెట్టేసే పనిలో వైసీపీ, టీడీపీ నాయకులు నిమగ్నమయ్యారు. ఈక్రమంలోనే ఈ నెల 11న తహసీల్దారు బాలకిషన్‌కు ఇరుపార్టీల వారు పరస్పర ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం అధికారులకు తలపోటుగా మారింది.

800 క్వింటాళ్ల బఫర్ స్టాక్

వైసీపీ పాలనలో పనిచేసిన స్టోర్ డీలర్లు కంబదూరు మండలంలోనే 800 క్వింటాళ్ల వరకు బఫర్ బియ్యాన్ని చూపించారని స్టోర్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు రఫీ తహసీల్దారు బాలకిషన్‌కు ఈ నెల 11 న ఫిర్యాదు చేశారు. దీంతో వారు చేసిన తప్పిదాలు, అక్రమాలకు ప్రస్తుతం ఉన్న స్టోర్ డీలర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ 800 క్వింటాళ్ల బఫర్ బియ్యం వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలని పదినెలల నుంచి సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్టోర్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పంతా వారిదే..

బఫర్ బియ్యం మొత్తాన్ని అప్పటికే అధికారులకు అప్పజెప్పామని, ఇందులో తమ తప్పిదం ఏమి లేదని ఎంపీపీ భీమేష్, వైసీపీ మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు యాదవ్‌తో పాటు మరికొంతమంది కలిసి ఈ నెల 11 న తహసీల్దారు బాలకిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పుడున్న స్టోర్ డీలర్లే తప్పిదాలు చేస్తున్నారంటూ తహసీల్దారుకు విన్నవించారు. అప్పటికే బఫర్ బియ్యం వ్యవహారాన్ని పూర్తిగా కొలిక్కి తీసుకువచ్చామని, అప్పటి స్టోర్ డీలర్లు చెబుతున్నారు.

సోషల్ మీడియాలో రచ్చ

వైసీపీ పాలనలో స్టోర్ డీలర్లుగా పని చేసిన కొందరు బఫర్ బియ్యం వ్యవహారంలో తమ తప్పేమీలేదని సోషల్ మీడియాలో ఆధారాలు చూపిస్తూ వైరల్ చేస్తున్నారు. ప్రస్తుత స్టోర్ డీలర్లు కూడా 800 క్వింటాళ్ల బఫర్ బియ్యాన్ని గతంలో చూపించి, ఇప్పుడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అదే సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. కార్డుదారులకు బియ్యం ఎగ్గొట్టినట్లు ఆధారాలు చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులకు తలపోటు

సీఎస్‌డీటీ, సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులకు బఫర్ బియ్యం వ్యవహారం తలపోటుగా మారింది. గత పదినెలల నుంచి బఫర్ బియ్యం విషయాన్ని సివిల్ సప్లై రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ప్రయో



బఫర్ బియ్యంపై ఈనెల 11న కంబదూరులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రస్తుత స్టోర్ డీలర్లు

రమణీయం.. చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన ఆంధ్ర, కర్ణాటక భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కణేకల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన చిక్కణ్ణేశ్వర స్వామి రథోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు మడితేరు నిర్వహించారు. సాయంత్రం 4.20 గంటలకు వేలాదిగా తరలివచ్చిన ఆంధ్ర, కర్ణాటక భక్తుల సమక్షంలో రథాన్ని పురవీధులలో లాగారు. పూలతో అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హరహర మహాదేవ శంభో శంకర అనే నినాదాలతో స్థానిక ఎదురు బసణ్ణ గుడి వరకు, అనంతరం వీరనాగమ్మ కట్ట వరకు రథాన్ని లాగారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో, డోలు డప్పులతో రథం కొనసాగింది. రథోత్సవానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డితో పాటు స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, మరియప్ప, ఆది, బీటీ రమేష్, సుదర్శన్, నవీన్, చంద్రశేఖర్‌గుప్తా, నాగరాజు, అనిల్ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, నాగభూషణ, చాంద్‌బాషా, మాబుసాబ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు వేలూరు మరియప్ప ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ కాలవ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

తెల్లారిన బతుకులు..

ఆలయానికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు..

- ఆగివున్న ఆటోను ఢీకొన్న కంటైనర్
- ముగ్గురు మహిళల దుర్మరణం
- 11 మందికి గాయాలు
- కన్నీళ్లు పెట్టుకున్న దొడగట్ట

చైత్ర పౌర్ణమి.. ఒకే ఊరికి చెందినవారు
ఆటోలో ఆలయానికి వెళ్లారు.. అక్కడే జాగారం చేశారు..
తెల్లవారుజామున నిద్రలేచి.. ఊరికి పయనమయ్యారు..
ఆటోలోనే కునుకు తీస్తున్నారు.. డ్రైవర్ రోడ్డు పక్కన ఆటో ఆపి..
నీటితో మొహం కడుక్కుంటున్నాడు..
నిముషంపాటు ప్రయాణించి ఉండుంటే..
జాతీయ రహదారి వదిలి.. ఊరి దారికి మళ్లేవారు..
ఇంతలోనే మృత్యువు దూసుకొచ్చింది..
అతివేగంతో వచ్చిన కంటైనర్ రెప్ప పాటులో ఢీకొట్టింది..
ఆటో రోడ్డు పక్కనున్న ముళ్ల పొదల్లోకి వెళ్లింది..
అందులోని వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు..
ముగ్గురు నిర్జీవంగా పడి ఉన్నారు..
కొందరు స్పృహ కోల్పోయి ఉన్నారు..
ఇంకొందరు ఆర్తనాదాలు పెడుతున్నారు..
నిరుపేద కుటుంబాల్లో అంతులేని విషాదం
అలుముకుంది.

7





ప్రమాదానికి కారణమైన కంటైనర్.. మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి తీసుకెళ్తున్న ఎస్‌ఐ రంగుడు యాదవ్

నేటి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతి వారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం రద్దు చేశామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ జయంతిని సందర్భంగా సెలవు కావడంతో. కలెక్టరేట్‌లో జరిగే ఫిర్యాదుల స్వీకరణను రద్దుచేశామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

నార్పల ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నార్పల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ నాగమణిపై సస్పెన్షన్ వేటు పడింది. 'క్షేత్రస్థాయిలో స్వాహాయకురాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి, చర్యలు తీసుకున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఏపీఓ రమేష్ రఘురాం తెలిపారు. ఆమె అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

- భర్త, కుమార్తెకు తీవ్రగాయాలు
- చిత్తూరు జిల్లా పుంగనూరు సుగాలి మిట్ట వద్ద ప్రమాదం

7

అరటి తోటల మధ్యలో రేషన్ బియ్యం డంప్

- సీజ్ చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు

7

కళ్లుగప్పి...!





చికిత్స కోసం వచ్చిన బాధితులు

సర్వజనాస్పత్రిలో కంటి వైద్యుల కాసుల వేట

- రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతున్న వైనం
- అక్కడే శస్త్ర చికిత్సలు

అనంతపురం టౌన్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): 'అవ్వా... తాతా.. మీకు కంటి సమస్య ఉంది.. ఇక్కడేమో ఉచితంగా చూస్తారు. ఆపరేషన్లు కూడా చేస్తారు. కాకపోతే.. వారం, పదిరోజులు పడుతుంది. అప్పటివరకు ఉంటే మీకంటి చూపుకే ప్రమాదం. మేము చెబుతాం, ఫలానా ప్రైవేటు ఆస్పత్రికి పోండి... అక్కడకు మేమే వస్తాం.. ఒకట్రెండు గంటల్లో ఆపరేషన్ చేస్తాం. మేరేమీ డబ్బు ఇవ్వద్దు' అంటూ జిల్లా సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు బాధితులను ప్రైవేటుకు తరలించి, డబ్బు దండుకుంటున్నారు. ఈ వ్యవహారం నెలలుగా సాగుతున్నా ఆ విభాగ డాక్టర్లు మౌనంగా ఉంటున్నారు. ఈ దోపిడీ వ్యవహారం మితిమీరిపోవడంతో ఆ ఇద్దరు కంటి డాక్టర్ల బరితెగింపు గురించి ఆస్పత్రిలో తీవ్ర చర్చ సాగుతోంది.



జిల్లా ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్

ప్రైవేటుకు పోండి..

జిల్లా సర్వజనాస్పత్రిలో కంటివైద్య విభాగం ప్రత్యేకంగా ఉంది. వయసుపైబడిన వృద్ధులకు కంటిచూపు మందగిస్తుంది. అలాంటి వారు సర్వజనాస్పత్రికి రోజూ 150 నుంచి 200 మంది వరకు వస్తుంటారు. శుక్లం (కాటరాక్ట్), కంటిపొర (ప్టైరాజియం), బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ సమస్యలతో అధికమంది బాధపడుతుంటారు. దీనిని ఇద్దరు కంటి వైద్య విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆసరాగా చేసుకుంటున్నారనే ఆరోపణలు న్నాయి. కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన శస్త్రచికిత్సలకు వార్డులో అడ్మిషన్ చేయాలి. ఆ ఇద్దరు డాక్టర్లు ఇక్కడ ఆపరేషన్లు చేయాలంటే ఆలస్యమవుతుందనీ, ఫలానా ప్రైవేటు ఆస్పత్రికి వెళితే అక్కడకు తామే వచ్చి గంటల్లోనే ఉచితంగా చేస్తామని చెప్పి పంపిస్తున్నారు. కంటి సమస్య కాబట్టి, నిర్లక్ష్యంచేస్తే చూపు పోతుందేమోనన్న భయంతో బాధితులు డాక్టర్లు చెప్పినట్లు ప్రైవేటుకు వెళ్లిపోతున్నారు.

ఆ ఆస్పత్రిలో కేసులను పరిశీలిస్తే..

నగరంలోని సూర్యానగర్ నుంచి ధర్మవరం వైపు వెళ్లే రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రోగులను తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ కంటి ఆపరేషన్లకు సంబంధించిన కేసులను పరిశీలిస్తే ఈ అక్రమ వ్యవహారం బయటపడుతుంది. ఆ కేసులు జిల్లా ఆస్పత్రిలో ఓపీలు తీసుకున్నారా.. అక్కడ ఆపరేషన్లు చేశారా.. ఎన్టీఆర్ వైద్యసేవ కింద నమోదు చేశారా.. తదితరాలను పరిశీలిస్తే ఆ ఇద్దరు కంటిడాక్టర్ల బరితెగింపు బయటపడుతుంది. ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో?

నమ్మి వెళ్తే నిలువు దోపిడీ?

ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పి.. పంపిన వైద్యులు ప్రైవేటు ఆస్పత్రిలో బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నారని సమాచారం. మళ్లీ అక్కడ పరీక్షల పేరున రూ1000 నుంచి రూ.2000 వరకు వసూలు చేసుకుని, జేబులు నింపుకుంటున్నారని తెలుస్తోంది. అనుకున్న ప్రకారం సర్వజనాస్పత్రిలో డ్యూటీ ఎగ్గొట్టి మరీ.. వారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఆపరేషన్లు చేసేస్తున్నారట. మళ్లీ ఆ కేసులను ఎన్టీఆర్ వైద్యసేవ కింద చూపిస్తూ డబ్బు దండుకుంటున్నారు. ఈవిషయంపై కొందరు అడిగితే 'మేమింతే.. మీకేంటి..?' అంటూ ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ బూతుపురాణాలతో రెచ్చిపోతున్నారట. ఇదంతా ఆ విభాగ పైఅధికారులు, సీనియర్లకు తెలిసినా పట్టించుకోకపోవడం శోచనీయం.

వాస్తవమైతే చర్యలు తీసుకుంటాం



కంటి సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారిని ప్రైవేటుకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత హెచ్‌ఓడీ, సీనియర్ డాక్టర్లతో మాట్లాడా. పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తాం. వాస్తవమైతే శాఖాపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, సర్వజనాస్పత్రి

తెల్లారిన బతుకులు..

హిందూపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం ధనాపురం క్రాస్ సమీపంలో కొడికొండ చెక్‌పోస్టు-శిర జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు పక్కన ఆగివున్న ఆటోను వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు మహిళలు మరణించగా.. 11 మంది గాయపడ్డారు. పరిగి ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన 13 మంది భక్తులు గోనిమేకలపల్లికి చెందిన బాబు ఆటోలో శనివారం సాయంత్రం 7.30 ప్రాంతంలో బయలుదేరి హిందూపురం మండలంలోని కొటిపికి వచ్చారు. అక్కడున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జాగరణ చేసి తెల్లవారుజామున 4.30గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యారు. సుమారు 5.00 గంటల సమయంలో ధనాపురం క్రాస్ వరకు ఆటో వెళ్లింది. ఆటోలో ఉన్నవారంతా నిద్రిస్తున్నారు. దీంతో ఆటో డ్రైవర్ మొహం కడుక్కునేందుకు వాహనాన్ని రోడ్డుపక్కన ఆపాడు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొని వెళ్లిపోయింది. ఆటో కంపచెట్లలో ఎగిరిపడగా.. అందులో ఉన్న దొడగట్టకు చెందిన ఉప్పర వెంకటరాముడు భార్య ఉప్పర అలివేలమ్మ(40), ఉప్పర దాసన్న భార్య ఉప్పర సాకమ్మ(70), బోయ రామాంజినప్ప భార్య బోయ ఆదిలక్ష్మమ్మ(60) దుర్మరణం చెందారు. అందులో ప్రయాణిస్తున్న అంజినరెడ్డి, అతడి భార్య ప్రమీల, పాపమ్మ, విజయ్, ఆటో డ్రైవర్ బాబు, చిన్నారులు అభినవ్, అనిల్‌కుమార్, అంజినమ్మ, రూప, యశ్వంత్‌రెడ్డి, సుజాత గాయపడ్డారు. స్థానికులు.. పరిగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిగి ఎస్ఐ రంగడు యాదవ్, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో అంజినరెడ్డి, అతడి భార్య ప్రమీల పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. మృతిచెందిన అలివేలమ్మకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఆదిలక్ష్మమ్మకు భర్త, ముగ్గురు పిల్లలున్నారు. సాకమ్మకు ఎవరూలేరు. మృతిచెందినవారు కూలి, వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవారు.

బెంగళూరులో కంటైనర్ పట్టివేత

ఆటోను ఢీకొని వెళ్లిపోయిన కంటైనర్‌ను మొదట గుర్తుతెలియని వాహనంగా పరిగణించారు. పోలీసులు ఆ రహదారిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బెంగళూరులో వాహనాన్ని గుర్తించారు. వాహనం పార్శిల్ సర్వీస్ బెంగళూరు నుంచి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా మడకశిర, పావగడ వెళ్తోంది. ప్రమాదం జరగడంతో వారు నేరుగా బెంగళూరు వెళ్లారు. పోలీసులు వాహనాన్ని గుర్తించి, పరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు.

సీఎం, మంత్రుల దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రమాదంపై ఆరా తీశారు. జిల్లాకు చెందిన పెనుకొండ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. బాధితుల కుటుంబాలను ఫోన్‌లో పరామర్శించారు. ఎంపీ బీకే పార్థసారధి హిందూపురం ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. గాయపడిన వారిని పరామర్శించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందించారు. తన వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి, వారిని ప్రభుత్వాస్పత్రికి పంపించారు.


ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

వైద్యుల అలసత్వంపై ఆగ్రహం

ఘోర రోడ్డు ప్రమాదం జరిగి గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తే అరగంటపాటు వైద్యులు రాకపోవడంతో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌ఓలను ఫోన్‌లో సంప్రదించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

దొడఘట్టలో విషాదఛాయలు


అలివేలమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులంతా రొద్దం మండలం దొడఘట్టకు చెందినవారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ముగ్గురు చనిపోవడం, 10 మంది గాయపడడంతో ఆయా కుటుంబాలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకురావడంతో వారి కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు.


హిందూపురం ఆస్పత్రి వద్ద విషాదంలో మృతుల కుటుంబ సభ్యులు


మృతదేహాన్ని తరలిస్తున్న ఎస్ఐ రంగడు యాదవ్

పెనుకొండ వద్ద బీహార్ వాసి..

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపలి వద్ద జాతీయరహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో బీహార్‌వాసి మృతిచెందాడు. ఎస్ఐ రాజేష్ తెలిపిన మేరకు బీహార్‌కు చెందిన చోటా సాహ్ని(30) మూడు రోజుల క్రితం కియ పరిశ్రమలో పనికోసం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం అమ్మవారిపల్లి నుంచి పెనుకొండ వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా ముందు వెళ్తున్న లారీ స్పీడ్‌బ్రేకర్ వద్ద ఒక్కసారిగా స్లో చేయడంతో వెనుకే వస్తున్న చోటాసాహ్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- భర్త, కుమార్తెకు తీవ్రగాయాలు
- చిత్తూరు జిల్లా పుంగనూరు సుగాలి మిట్ట వద్ద ప్రమాదం


శారద (ఫైల్)

కదిరి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలోని సుగాలి మిట్టవద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి మండలంలోని బాలప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ శారద(45) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో ఆమె భర్త అన్నమయ్య జిల్లా సోంపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరమణ, కుమార్తె కీర్తనకు తీవ్రగాయాలైనట్లు ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి. కదిరి మండలం బాలప్పగారిపల్లిలో శారద ఉపాధ్యాయులురాలిగా పనిచేస్తోంది. ఆమె భర్త వెంకటరమణ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం సోంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వారు నూతనంగా కొనుగోలుచేసిన కారులో కుమార్తె తో కలిసి అరుణాచలం వెళ్లి స్వామివారి దర్శనాంతరం తిరిగి వస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపం సుగాలిమిట్ట వద్ద కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన భర్త, కుమార్తెను బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది. కదిరి పట్టణంలోని అడపాల వీధిలో వీరు నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉపాధ్యాయురాలి మృతిపట్ల ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ, కీర్తన

క్రైం కార్నర్

పాముకాటుతో రైతు మృతి


శ్రీనివాసులు (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీ బుడ్డపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు (52) పాముకాటుతో శనివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. శ్రీనివాసులు కొంతకాలంగా సోమందేపల్లిలో నివాసముంటూ, బుడ్డపల్లిలో వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంటకు నీరు పెడుతుండగా శనివారం పాముకాటుకు గురయ్యాడు. అనంతరం సోమందెపల్లికి వెళ్లి చికిత్స చేయించుకుని, పెనుకొండ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు చెప్పారు. శ్రీనివాసులుకు భార్య ముత్తమ్మ, కుమారుడు నవీన్, కుమార్తె రూప ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అరటి తోటల మధ్యలో రేషన్ బియ్యం డంప్

- సీజ్ చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు


సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

యాడికి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో అరటి తోటల మధ్యలో నిల్వచేసిన 18 టన్నుల బియ్యాన్ని ఆదివారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. అరటితోటల మధ్యలో ఉన్న బీడు పొలంలో రేషన్ బియ్యం నిల్వచేశారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. సమీపంలోని చెరకుతోట వద్ద దారి పక్కనే నిలువచేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటిని సీజ్‌చేశారు. సీజ్‌చేసిన బియ్యాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో యాడికి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎవరు నిల్వ చేశారో?

రాయలచెరువు వద్ద జాతీయ రహదారికి అరకిలోమీటర్ దూరంలో అరటి తోటల పక్కన రేషన్ బియ్యాన్ని ఎవరు నిల్వచేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. మండల, జిల్లా సరిహద్దు గ్రామానికి చెందిన వ్యక్తి రేషన్ బియ్యం వ్యాపారం చేస్తుంటాడని, అరటితోటల మధ్య నిల్వచేసిన బియ్యం అతనివే అయి ఉండవచ్చునని స్థానికులు చర్చించుకుంటున్నారు.

దేవుడితో కూడా రాజకీయాలు చేస్తారా..!

- కరుణాకర్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే..
- ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

రామగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కుల, మత, శవరాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత మండిపడ్డారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 12 మంది లబ్దిదారులకు రూ.4.63లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదప్రజల కోసం అనునిత్యం కృషిచేస్తుంటే వైసీపీ నాయకులు తమ స్వార్థంకోసం అన్నింటా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ ఎస్వీగోశాలలో వందకుపైగా గోవులు మృతిచెందాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన చెప్పేవన్నీ పచ్చి అబద్దాలని, అసలు ఆయనకు ఈసమాచారం ఎవరిచ్చారో చెప్పాలన్నారు. మొదటి నుంచి టీటీడీ విషయంలో వైసీపీ రాజకీయాలు చేయడం, ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తోందన్నారు. ఎక్కడ ముఖ్యమంత్రికి మంచిపేరు వస్తుందోనన్న భయంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోలేదని నిరూపించేందుకు అక్కడ టీటీడీ సిద్ధంగా ఉందని, మరి కరుణాకర్‌రెడ్డి ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. రామగిరి, చెన్నకొత్తపల్లి మండలా కన్వీనర్‌లు సుధాకర్, ముత్యాల్‌రెడ్డి, నాయకులు మాదాపురం శంకర్, శ్రీరాములు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అన్నీ అసత్య ప్రచారాలు

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు

శింగనమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయని కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గత ఐదేళ్ల గణాంకాల ప్రకారం వయసు మీదపడటం, ప్రసవ సమస్యలు, వ్యాధుల కారణంగా నెలకు 10 ఆవులు చనిపోతున్నాయని స్పష్టం చేశారు. కరుణాకరరెడ్డి విలేకరుల సమావేశంలో చూపిన ఫొటోలు గోవులకు సంబంధించినవి కావని, మరెక్కడివోనని అన్నారు. గోశాలలో 260 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఆవుల మృతి పోస్టుమార్టం రికార్డులపై ఆయన అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కరుణాకర్‌రెడ్డి చేస్తున్న దుష్ప్రచారంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, దేగల కృష్ణమూర్తి, జీసీ రామానాయుడు, అంగజాల రాము, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూల చంద్రమోహన్ పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో ఆవులు చనిపోయాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆదివారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయని టీటీడీ మాజీచైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ప్రచారంలో వాస్తవం లేదని మతవిద్వేశాలు రెచ్చగొట్టే విధంగా టీటీడీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవతలతో సమానంగా కొలిచే గోమాతలతో కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. టీటీడీలో సమూల ప్రక్షాళన జరగాలని ఎన్నికల ముందు సీఎం బాబు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే అనేక మార్పులు చేశారని అన్నారు. టీటీడీ భక్తులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని అన్నారు. దర్శనాలు, వసతి, ఇతర సేవలపై భక్తుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారని ఎమ్మెల్యే వివరించారు.

కసాపురం ఆలయానికి కిలో వెండి వితరణ


ఆలయ సూపరింటెండెంట్‌కు వెండిని అందజేస్తున్న మౌనిక, రాకేష్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ధర్మవరానికి చెందిన భక్తులు కిలోవెండిని అందజేశారు. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ఎన్ మౌనిక, రాకేష్ కిలో వెండిని ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. పండితులు వీరి పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశ్వీదించారు.

తిరుపతి ప్యాసింజరు ఆలస్యం

గుంతకల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు (నం.57403) రైలు ఆదివారం రెండు గంటల ఆలస్యంగా చేరింది. ఈ రైలు 12-50 గంటలకు అనంతపురానికి సరైన సమయంలో చేరినా వెంకటాంపల్లి, గూళ్లపాళ్యం స్టేషన్లలో ఆపేసిన కారణంగా ఆలస్యమైంది. ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్ల ట్రాఫిక్ కారణంగా ప్యాసింజరు రైలును నిలిపేసినట్లు సమాచారం. కాగా గుంతకల్లు-కల్లూరు సెక్షన్‌లో పనుల కారణంగా ఆలస్యంగా రైలు నడచినట్టు అనధికారికంగా తెలిసింది. ప్యాసింజరును నిలిపేసిన సమయాల్లో ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లు నడచినట్టు ప్రయాణికులు తెలిపారు. వెంకటాంపల్లి స్టేషన్‌లో గంట, గూళ్లపాళ్యం స్టేషన్‌లో గంటసేపు రైలును ఆపినట్లు ప్రయాణికులు వివరించారు. ఈ కారణంగా మధ్యాహ్నం 3-30 గంటలకు రైలు గుంతకల్లు స్టేషన్‌కు రావాల్సి ఉండగా, సాయంత్రం 5-40 గంటలకు చేరింది.

కరుణాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- ప్రభుత్వ విప్ కాలవ


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీపై పనిగట్టుకుని కుట్రపూరితంగా దుష్ప్రచారం సాగిస్తున్న కరుణాకర్‌రెడ్డిపై క్రిమినల్‌కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల ఆదరాభిమానాలతో వెలుగొందుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రను దెబ్బతీయడానికి వైసీపీ నాయకులు పనిగట్టుకుని దుష్ప్రచారం సాగిస్తుండడం బాధాకరమన్నారు. అత్యంత ప్రాచీనమైనది హైందవ మతమన్నారు. దేవుడిపై నమ్మకం, భక్తి ఉన్నవారు దైవారాధన చేస్తుంటారన్నారు. అలాంటి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి టీటీడీ నడుపుతున్న గోశాలపై పనిగట్టుకుని దుష్ప్రచారం సాగించడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ముసుగులో ఉండే కరుణాకర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి లాంటి వారు అటూ ఇటూ కాని హిందూవులని విమర్శించారు. ఇళ్లలో క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంటారన్నారు. ఎవరి భక్తి వారిదన్నారు. లోపల ఇతర రంగు ముసుగు వేసుకొని బయటకు వచ్చి హిందూవులను మభ్యపెట్టడానికి సాగిస్తున్న రాజకీయకుట్రలు భక్తులకు తెలిసిపోతున్నాయన్నారు. కరుణాకర్‌రెడ్డిని కఠినంగా శిక్షించినపుడే మరొకరు దేవదేవుని జోలికి వెళ్లరన్నారు. హిందువుగా నేను గర్వపడుతూ తన మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవిస్తానన్నారు. అటూ ఇటూ కానీ ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి దొంగభక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉండాలని కోరారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

తాడిపత్రి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో ఆదివారం వ్యభిచార కేంద్రంపై దాడిచేసి నలుగురిని అరెస్టుచేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీదేవి, అంకిరెడ్డి, వెంకటరెడ్డి గన్నెవారిపల్లికాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అనకాపల్లి నుంచి మహిళలను రప్పిస్తూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహించేవారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి నిర్వాహకులతోపాటు నాగవేణి, విజయవర్ధన్‌రెడ్డి, పుష్పరాజ్‌లను అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.2వేలు, సెల్‌ఫోన్‌ను సీజ్‌చేసినట్లు సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పశువుల సంత ఆదాయం రూ.3.83 లక్షలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో రూ.3.83 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.52 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.30 లక్షలు వచ్చిందని తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దాం

రామగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగే అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగుయువత మండల అధ్యక్షుడు లింగా శ్రీధర్‌నాయుడు ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు వేడుకలను నిర్వహి స్తామని తెలిపారు. అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీచేస్తామన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ తప్పక హాజరుకావాలని వారు కోరారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను సోమవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పాములరాయి రఘు తెలిపారు. ఈ మేరకు వారం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవం ఉంటుందని, ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని వారు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరూ విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి : ఏఈ

రాప్తాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ బకాయిలు రూ. 14 లక్షలు ఉన్నాయని వాటిని వెంటనే రైతులు చెల్లించాలని విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్‌నాయుడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సకాలంలో చెల్లించి సహకరించాలని ఆయన కోరారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ వెనుకబడిన వర్గాల కోసం చేసిన కృషి అమోఘమని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మం డల్ వర్ధంతిని స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ఆదివారం ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఈఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్లు శ్రీనివాసులు, మర్రిస్వామి, శ్రీరాములు, ఎల్లప్ప, మల్లికార్జున, రాయలసీమ కోకన్వీనర్లు రామాంజనేయులు, వరదరాజులు, రమణ, రాజారావు, రవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ సమీపంలోని మటన్‌మార్కెట్‌లో నూతనంగా నిర్మించనున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచు శివశంకర్ విరాళం ఇచ్చారు. గ్రామంలోని తన ఇంటి వద్ద ఆయన ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు రూ. 15వేలు అందజేశారు.

గ్రామ సభల్లో పాల్గొనాలని ప్రచారం

● అనంతపురం రూరల్: మండలంలోని కక్కలపల్లి సచివాలయం వద్ద సోమవారం జరగనున్న గ్రామ సభలో ప్రజలందరూ పాల్గొనాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. వారు ఆదివారం కక్కలపల్లి పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కే అల్తాఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, నాయకులు సుబ్బరాయుడు, సదాశివ, తిరుపాలు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

నార్పల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచు మన్నీల సుప్రియ అధ్యక్షతన గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే గ్రామ సభకు గ్రామ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

టీడీపీ కార్యకర్తలకు ప్రాణహాని

● టీడీపీ జిల్లా అధ్యక్షుడికి కనుంపల్లి కార్యకర్తల ఫిర్యాదు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన ఎస్. ప్రసాద్ ఆయన తండ్రి కుమార్ నుంచి టీడీపీ కార్యకర్తలకు ప్రాణహాని ఉందని అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. నాయకులు బిల్లా వెంకటేష్, బిల్లా జానకి, వి. చిన్న నల్లప్ప, నల్లమ్మ, ఎస్. సంతోష్, ఇ. నల్లమ్మ తదితరులు ఆదివారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడికి ఫిర్యాదు అందించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కష్టపడిన తమపై ఎస్సీ కులాన్ని అడ్డుపెట్టుకొని, సోషల్ మీడియాలో అవమానిస్తూ పోస్టులు పెడుతున్నారన్నారు. శింగనమల ఎమ్మెల్యే కుటుంబంపైనా సోషల్ మీడియాలో బురదజల్లుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులను పార్టీ నుంచి తొలగించాలని కోరారు.

మహిళపై కేసు

గార్లదిన్నె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలగాసిపల్లిలో దాడి ఘటనలో ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో నల్లప్ప, పద్మావతి అనే ఇద్దరు బంధువులు వారి మధ్య శనివారం వాగ్వాదం చోటు చేసుకుంది. తనను దూషించాడని పద్మావతి చేసిన దాడిలో నల్లప్ప తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పద్మావతిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ హాకీ పోటీల్లో జిల్లా క్రీడాకారిణుల ప్రతిభ



రాణించిన జిల్లా బాలికల హాకీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి హాకీపోటీల్లో జిల్లా క్రీడాకారిణులు ప్రతిభచాటారు. జిల్లా బాలికల జట్టులో శివగంగ, దివ్య, ఇందు, సమీరా, సుమియా, జ్యోతి, అర్చన, సాయిభవ్య, మైథిలి, నవ్య, శృతి, శాలిని, కీర్తన, అక్షయ, వింధ్యశ్రీ, సనతాజ్, హర్షిత, మధురిమబాయి, జ్ఞానేశ్వరి ఉన్నారు. కళ్యాణదుర్గం నుంచి జట్టులో సుమియా, శృతి, అర్చన, సమీరా, సనాతాజ్, అక్షయ, అఖిల ఏడుగురు ఉండడం విశేషం. జట్టును, కోచ్‌లు అక్రమ్‌బాషా, దేవకిని ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ అభినందించారు.

మూగజీవాలకు తీరని దాహం



వటి పొలంలో మేత మేస్తున్న గొర్రెలు

● గతంలో నిర్మించిన నీటితొట్టెలు ధ్వంసం
● వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న కాపరులు, రైతులు
● త్వరగా కొత్తవి నిర్మించాలని వేడుకోలు

శింగనమల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అసలే వేసవికాలం. గత ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో మండలంలోని కుంటలు, చెరువుల్లో నీరు లేదు. మూగజీవాల దాహం తీర్చే నీటి తొట్టెలు కనబడడంలేదు. దీంతో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గొర్రెల కాపర్లు, రైతుల తిప్పలు వర్ణనాతీతం. వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో పశువులు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు కాలగర్భంలో కలిసిపోయాయి. దీంతో మూగజీవాలు నీళ్ల దొరక్క దప్పికతో తల్లడిల్లుతున్నాయి.

కనిపించని నీటి తొట్టెలు

ఉపాధిహామీ పథకం కింద 2018-19లో మండలవ్యాప్తంగా గ్రామానికి ఒక్క నీటి తొట్టెను దాదాపు రూ. 25 వేలు చొప్పున వె చ్చించి నిర్మించారు. ఇంటి గ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్ మెంట్ ప్రోగాం (ఐడబ్ల్యూ ఎంపీ) ద్వారా ఉపాధి హామీ పథకం కింద గ్రామ ప్రంచాయతీ నిధులతో మండల వ్యాప్తంగా 19 పంచాయతీల్లో 50 పశువుల తొట్టెలు నిర్మించారు. వీటి నిర్వహణను పశుసంవర్ధన శాఖకు అప్పగించారు. అయితే గత వైసీపీ పాలనలో అవి పూర్తిగా ధ్వంసం కావడంతో కాలగర్భంలో కలిసిపోయాయి.



వ్యవసాయ బోరు ద్వారా గొర్రెల కాపర్లు గుంతలో నీటిని వదులుకున్న దృశ్యం

గత ఐదేళ్లలో ధ్వంసం

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నీటితొట్టెల గురించి పట్టించుకోలేదు. కొందరు తొట్టెలను పగులగొట్టి ఆ స్థలాలను ఆక్రమంచుకున్నారు. ఇంకొన్ని కట్టిన చోట్ల వాటి ఆనవాళ్లే కనిపించకూండాపోయాయి. ఉన్న కొన్ని తొట్టెలు బీటలు బారి ఎరువుల దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో కిలో మీటర్ల దూరం తీసువెళ్లి మూగజీవాలకు నీరు తాపించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాపర్లు, రైతులు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఉన్న తొట్టెలను వినియోగంలోకి తీసుకురావాలని, మిగిలిన గ్రామాల్లో నూతనంగా నిర్మించాలని కాపర్లు, రైతులు కోరుతున్నారు.

చెరువులోని వాసన నీటినే తాగిస్తున్నాం



అటవీ ప్రాంతాంలో ఎక్కడా చుక్క నీరు లేదు. దీంతో మా గొర్రెలకు శింగనమల చెరువులో ఉన్న వాసన నీటిని తాపుతున్నాం. ఆ నీరు తాగి జీవాలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. గతంలో మాదిరి ప్రస్తుత ప్రభుత్వం త్వరగా తొట్టెలు నిర్మించి, పంచాయతీల ద్వారా నీరు వదిలితే జీవాలకు దప్పిక తీర్చవచ్చు. -మునెప్ప, గొర్రెల కాపరి, శింగనమల

రైతులను ఆశ్రయించి.. నీరు తాపుతున్నాం



మా జీవాలకు నీరు తాపడానికి రైతులను ఆశ్రయిస్తున్నాం. వారి అనుమతితో పొలంలోనే ఒక గుంత తవ్వి వ్యవసాయ బోరు నుంచి అందులోకి నీటిని వదలుతున్నాం. ఆ నీటితో జీవాల దప్పిక తీరుస్తున్నాం ప్రభుత్వం స్పందించి త్వరగా తొట్టెలు నిర్మించి నీటి సౌకర్యం కల్పించాలి.
- వెంకటనారాయణ, గొర్రెల కాపరి

ప్రతిపాదనలు పంపాం

శింగనమల మండలంలో మూగజీవాల దప్పిక తీర్చడానికి ఉపాధి హామీ పథకం కింద తొట్టెల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. గతంలో నిర్మించిన తొట్టెల మరమ్మతులతో పాటు అవసరమైన గ్రామాల్లో కొత్తవి నిర్మిస్తాం. -పద్మనాభయ్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ

కురుగుంట కేజీబీవీలో 75 శాతం ఉత్తీర్ణత

అనంతపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కురుగుంటలో ఉన్న కేజీబీవీలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు 75 శాతం ఉత్తీర్ణులైనట్లు ఎస్ఓ నర్మద తెలిపారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఇంటర్ మొదటి సంవ త్సరంలో 33 మంది పరీక్ష రాయగా తొమ్మిది మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో 27 మంది పరీక్ష రాయగా ఏడుగురు ఫెయిల్ అయినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో తనుజా 423 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో తస్లీమ్ 923 మార్కులు సాధించినట్లు ఎస్ఓ తెలిపారు.

రాయల జయంతి.. వర్ధంతిపై పునరాలోచించాలి

● రాయలసీమ బలిజ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య



మాట్లాడుతున్న రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, కులబాంధవుల జయంతులు, వర్ధంతుల జాబితాలో శ్రీకృష్ణదేవరాయల జయంతిగానీ, వర్ధంతిగానీ పొందుపరచకపోవడం బాధాకరమని రాయలసీమ బలిజ మహాసంఘంనాయకులు అన్నారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకృష్ణదేవరాయలు ఎన్నో చెరువులు, తటాకాలు, సత్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అండగా నిలిచారన్నది దేశానికి తెలిసిన సత్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల కులబాంధవుల జయంతులు, వర్ధంతుల ను ప్రకటించి అధికారిక సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే శ్రీకృష్ణదేవరాయల విషయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకొని శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిని అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాములరాయి వెంకటేష్, కార్యదర్శి పున్నం విజయభాస్కర్, కోశాధికారి కోనేటి సాయిప్రసాద్, నాయకులు గూటిపల్లి శ్రీధర్, జీవీ రమణ, ప్రభాకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'నేత్రదానంపై అవగాహన అవసరం'



సమావేశంలో రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ ఛైర్‌పర్సన్ భారతి పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ భారతి మాట్లాడుతూ... ప్రస్తుతం జిల్లాలో ఉన్న రెడ్‌క్రాస్ కార్నియా సేకరణ కేంద్రంతో పాటు నూతనంగా కార్నియా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ సూచించినట్లు తెలిపారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ఈ సదుపాయం త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రజలు అపోహలు వీడి నేత్రదానంపై కనీస అవగాహనతో ముందుకు రావాలని కోరారు. నేత్రదానం సమయంలో కేవలం కార్నియా పొర మాత్రమే తీసుకుంటారని...దీంతో కంటిలో ఎలాంటి మార్పు కనిపించదని తెలిపారు. నేత్రదానం చేయాలనుకున్న వారు మరిన్ని వివరాలకు రెడ్‌క్రాస్‌కు సంబంధించిన సెల్ నంబర్లు 8332021919, 9666629797ను సంప్రదించాలని కోరారు. కంటి ప్రాసెసింగ్ కేంద్రం ప్రారం భించేందుకు అన్నివిధాలా సహకరిస్తామని స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ఛైర్మన్ లక్ష్మణ్‌ప్రసాద్, సభ్యులు తిరుపతినాయుడు, చంద్రకాంత్ నాయుడు, ఆలంబన జనార్దన్, అప్పా సుధీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శింగనమలకు ఎమ్మెల్యే రాక

శింగనమల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్ర మైన శింగనమలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం రానున్నట్లు ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ 135 జయంతి సందర్భంగా శింగనమలలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించి ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. కావున ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, రచయితలు, కళాకారులు, టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

గాస్పెల్ చర్చి నుంచి ఇద్దరు పెద్దల తొలగింపు

● సంఘ కాపరి బ్రదర్ టీపీ వరప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న కాపరి వరప్రసాద్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చర్చి సంఘానికి సంబంధించిన ఆర్థిక అంశాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు పెద్దలను తొలగించినట్లు కోర్టు రోడ్డులోని గాస్పెల్ అసెంబ్లీ చర్చి సంఘ కాపరి బ్రదర్ టీపీ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. గాస్పెల్ అసెంబ్లీ చర్చిలో ఆది వారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆదినారాయణ, ఆసాఫ్, హెరాల్డ్, దేవవరం, సభ్యులు కాంతి ఐజాక్, ఆరోరా రూబెన్, కాంతి జాన్ వెస్లీ, ప్రసాద్‌తో కలిసి వరప్రసాద్ రెడ్డి మాట్లాడారు. జీహెచ్ ఫిలిప్, రిటైర్డ్ ఎంఈఓ విజయకుమార్ సంఘ పెద్దలుగా పనిచేశారన్నారు. ఆ సమయంలో తోటి పెద్దలను విస్మరించి, చర్చికి సంబంధించిన నిధులను పక్కదారి మళ్లించారని ఆరోపించారు. సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను కోర్టురోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ ఖాదా ద్వారా జరిపేవారన్నారు. అయితే బ్యాంకు ఖాతాను జీ హెచ్ ఫిలిప్ తన నివాసానికి దగ్గరలోని జేఎన్టీయూ రోడ్డు ఆంధ్రాబ్యాంక్ బ్రాంచ్‌కు మార్చుకుని రూ. 40లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నారని తెలిపారు. మరోవైపు నగదుకూడా తీసుకెళ్లారని, వీటిని తిరగి పాత బ్యాంక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. సంఘ సమావేశాలకు హాజరుకాకుండా, వేరే చర్చిని ప్రారంభించారని తెలిపారు. గాస్పెల్ చర్చి చిరునామాతోనే ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని విదేశాల నుంచి నిధులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా అనేక రూపాల్లో అక్రమాలకు పాల్పడటంతో వారిద్దరని గాస్పెల్ అసెంబ్లీ చర్చి నుంచి బహిష్కరిస్తున్నట్లు సంఘ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానించారని వరప్రసాద్‌రెడ్డి వివరించారు.

డబ్బు కోసం...
తల్లి, చెల్లిపై అన్నదమ్ముల దాడి

●పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన



దాడిలో గాయపడిన అంజినమ్మ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నంపల్లిలో డబ్బు, బంగారం కోసం సొంత తల్లి, చెల్లిపై అన్నదమ్ములు దాడి చేసి గాయపర్చినట్లు బాధితులు తెలిపారు. బాధితురాలు లక్ష్మీదేవి, ఆమె కుమార్తె అంజినమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నంపల్లికి చెందిన లక్ష్మీదేవికి చంద్ర, అంజి అనే ఇద్దరు కుమారులు, అంజినమ్మ అనే కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యారు. రోజూ మద్యం తాగడానికి డబ్బు, బంగారం ఇవ్వాలని తల్లిని వేధింపులకు గురిచేసే వారు. వారు ఆదివారం కూడా మద్యానికి డబ్బు ఇవ్వలేదని తల్లి లక్ష్మీదేవిపై దాడి చేశారు. అడ్డుకున్న చెల్లి అంజనమ్మపైనా రోకలిబండ తీసుకుని దాడి చేశారు. అన్నదమ్ముల దాడిలో తల్లి లక్ష్మీదేవి, కుమార్తె అంజనమ్మ గాయపడ్డారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే పోలీసు సిబ్బంది పట్టించుకోలేదని తల్లి, కుమార్తె వాపోయారు. పైగా కాని స్టేబుళ్లు తమనే తిట్టారని తెలిపారు. తమపై దాడి చేసిన అన్నదమ్ములకు వైసీపీ స్థానిక నాయకుడు మధుసూదన్‌రెడ్డి అండగా ఉన్నారని, ఆయన చెప్పినట్లుగా పోలీసులు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అన్నదమ్ములపై కేసు నమోదు చేసి, తమపై మళ్లీ దాడి చేయకుండా రక్షణ కల్పించాలని తల్లి, బిడ్డ వేడుకుంటున్నారు.

వ్యక్తిపై లైంగిక వేధింపుల కేసు

గార్లదిన్నె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో భాస్కర్ అనే వ్యక్తిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడు మండలానికి చెందిన ఓ మహిళను కొద్దిరోజులుగా లైంగిక వేధిస్తున్నాడన్నారు. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

● రూరల్ డీఎస్పీ వెంకటేశులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



రాప్తాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, అవగాహనతోనే వాటిని పూర్తిగా నియంత్రించవచ్చని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నామని, ఫిర్యాదుదారులు తెలిపిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని ఆయన ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రశ్న: ఫ్యాక్షన్ నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీస్ పికెట్‌లు నిర్వహిస్తున్నాం. రౌడీ షీటర్లకు తరరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాం. తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణపై మీ చర్యలేమి?

జవాబు: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించేలా, పరిమిత వేగంతో వెళ్లేలా అవ గాహన కల్పిస్తున్నాం. రహదారి నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తున్నాం. పోలీసు శాఖ అధికారులు తరచుగా అవగాహన కల్పిస్తున్నా, చాలా మందిలో మార్పు రాలేదు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం లేదు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపుతున్నారు. అటువంటి వారికి జరిమానా విధిస్తున్నాం. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆ ప్రదేశాల్లో రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు...

జవాబు: బెల్టుషాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. మరింత నిఘా పెంచి బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సైబర్ నేరాలపై ఎలా అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు చాలా పెరిగిపోయాయి. ఓటీపీలు చెప్పమనడం, లింక్‌పైన క్లిక్ చేయమనడం, ఉద్యోగాలు వస్తాయి అని చెప్పడం తదితర వాటి ద్వారా ప్రజల ఖాతాల నుంచి డబ్బు లాగేస్తున్నారు. చదువుకున్న వారు కూడా సైబర్ నేరాల బారిన పడుతున్నారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. కేవలం అవగాహనతోనే సైబర్ నేరాలను నియంత్రించడం సాధ్యమవుతుంది.

ప్రశ్న: డయల్ 100కు ఫోన్ చేసిన వారి సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నారా?

జవాబు: ఆపదలో ఉన్న వారు, సహాయం కోసం కొంత మంది డయల్ 100కు ఫోన్ చేస్తుంటారు. పోలీసు సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి సమస్య పరిష్కరిస్తున్నారు.

ప్రశ్న: లోన్‌యాప్ ద్వారా రుణాలపై మీ సలహా ఏమి?

జవాబు: తక్కువ వడ్డీకి లోన్‌యాప్ ద్వారా రుణాలు ఇస్తామని ఆశ చూపుతారు. లోన్ యాప్‌ల నుంచి రుణం తీసుకునే వారి ఫోన్ లోని కెమెరాను, కాంటాక్టు మీడియాను, ఆధార్ నెంబర్, ఓటీపీని అడుగుతారు. లోన్ యాప్ ద్వారా తీసుకున్న రుణం ఎంత కాలం చెల్లించినా తీరదు. ఫోన్‌లోని సమాచారాన్ని దొంగలించి ఫొటోలను అశ్లీలంగా మార్చి సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు డిమాండ్ చేస్తారు. అందువల్ల లోన్ యాప్ ద్వారా అస్సలు రుణాలు తీసుకోకూడదు.

ఘనంగా ఇమాంషావలి ఉరుసు



భక్తులతో కిక్కిరిసిన దర్గా ప్రాంగణం


అనంతపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో వెలసిన హజరత్ షేక్ ఇమాంషావలి ఉరుసు ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసి, చదింపులు చేయించారు. దర్గా ప్రాంతంలో భక్తుల సందడి నెలకొంది. రాత్రి పంచరత్నావళి నాటక ప్రదర్శన నిర్వహించారు.

పూలేకి భారతరత్న ఇవ్వాలి

● ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతదేశపు మొదటి సామాజి క విప్లవకారులు మహాత్మ జ్యోతిరావ్ పూలేకి భారతరత్న అవార్డు ఇవ్వాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. అక్షరం కొందరిది కాదు... అందరిదీ కావాలని ఆకాంక్షించి, ఆచరించిన దేశ మొట్ట మొదటి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావ్ పూలే అని అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు స్త్రీజనోద్ధరణకు కృషి చేసిన మహనీయుడని అన్నారు. విద్యతో విశ్వీ కరణను సమర్థించిన మొదటి సంఘం సంస్కర్త పూలేకి భారతరత్న ఇవ్వాలన్నారు.

అంబేడ్కర్ జీవితం.. ఆదర్శం



క్విజ్ పోటీల విజేతలతో ఎన్‌వైకే అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని నెహ్రూ యువకేంద్రం అధికారులు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యువతకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువకేంద్రం అధికారులు మాట్లాడుతూ... అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోని ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని తె లి పారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగం ప్రతిఫలాలు అందిస్తోందన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, భారత రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేశారు. క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు భరత్, శివకుమార్, సెంట్రల్ యూనివర్శిటీ ఆచార్యులు ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, యువ నాయకులు రాజశేఖర్ గౌడ్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, జాతీయ యువ కార్యకర్తలు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

● అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి



తాడిపత్రి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడుతున్నామని, ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఆదివారం ఆయన్ను ఇంటర్వ్యూ చేయగా పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: శాంతిభద్రతల పరిరక్షణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శాంతిభద్రతలను రక్షించేందుకు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాం. ఫ్యాక్షన్ గ్రామాల్లో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి గొడవలు జరగకుండా చూస్తున్నాం. పట్టణంలో ఏ చిన్న ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: అసాంఘిక కార్యక్రమాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి అరెస్ట్ చేస్తున్నాం. ముఖ్యంగా గంజాయి, మట్కా, పేకాట స్థావరాలను కనిపెట్టేందుకు ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. గంజాయిపై ప్రత్యేక దృష్టిపెట్టి అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: చోరీల అడ్డుకట్టకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: ఎవరైనా ఊళ్లకు వెళ్లాలంటే పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇళ్లకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తాం. రాత్రి వేళల్లో పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం.

ప్రశ్న: ఇసుక, బియ్యం, మద్యం అక్రమ రవాణాపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఇసుక అక్రమ రవాణా కాకుండా తహసీల్దార్‌తో కలిసి ఒక టీంను ఏర్పాటుచేసి ఆ టీం పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని పర్యవేక్షిస్తున్నాం. అక్రమ బియ్యంపై కూడా రెవెన్యూ అధికారులతో కలిసి నిఘా ఉంచాం. మద్యం రవాణాను కూడా అరికడుతున్నాం.

ప్రశ్న: ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్‌లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగులపై ప్రత్యేకంగా స్పెషల్‌డ్రైవ్ ఏర్పాటుచేస్తున్నాం. అలాంటి వాటికి యువత బలికాకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం.

ప్రశ్న: డ్రోన్ కెమెరాలతో ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: డ్రోన్ కెమెరాల వల్ల అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి అరికట్టేందుకు కృషిచేస్తున్నాం. బహిర్గత ప్రదేశాల్లో మద్యం సేవించడం, పేకాట ఆడడం, మట్కా తదితర కార్యకలాపాలను పసిగట్టడానికి డ్రోన్ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

రేషన్ దుకాణం ప్రారంభం

ఉరవకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిద్యాల గ్రామంలో ఆదివారం 58వ రేషన్ దుకాణాన్ని మాజీ ఎంపీపీ సుంక రత్నమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులందరికీ నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని డీలర్‌కు సూచించారు. టీడీపీ నాయకులు మురళి, రామాంజనేయులు, సూరి, నారాయణస్వామి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పామిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ షీన 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 106మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు ఆయాష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ తిరుపతి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, కోశాధికారి షెక్షావలి పాల్గొన్నారు.

దళిత వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

ఉరవకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దళిత వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం కేవీపీఎస్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు సామాజిక చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లప్ప, సావిత్రి మాట్లాడుతూ.. చాలా దళితుల కాలనీల్లో వీధి లైట్లు,తాగునీటి సౌకర్యం, రోడ్లు, మురుగు కాలువలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి కనీస సదుపాయాలు లేవని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాటిని కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఐద్వా జిల్లా నాయకురాళ్లు శ్యామల, చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని, కౌలు రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు కృష్ణమూర్తి ఎస్ఎఫ్ఐ సిద్ధూ, గిరి, భీమేష్ పాల్గొన్నారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి తండాలో నాటుసారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో 510లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులు రాజునాయక్, వెంకటేష్‌నాయక్, లక్ష్మానాయక్‌పై కేసు నమోదు చేశారు. అలాగే పట్టణంలో బోయ రమేష్ అనే వ్యక్తి నుంచి 6 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వీరందరినీ రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏఈఎస్ శ్రీరామ్, సీఐ శివసాగర్, డీటీఎఫ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామూడురు గ్రామానికి చెందిన ఎల్లప్ప తన కుమారుడికి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వలేదని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లప్ప టీడీపీలో చురుగ్గా పని చేసేవాడు. ఆయన కుమారుడు గిరీష్ ఐదు నెలల నుంచి గ్రామంలో తాత్కాలిక ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఎల్లప్ప బీసీ కావడంతో మామూడురు ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్సీ రిజర్వేషన్ అయింది. దీంతో గత శనివారం ఎమ్మెల్యే సమక్షంలో ఎస్సీకి చెందిన నాగరాజు అనే వ్యక్తికి ఆ పోస్టును ఇచ్చారు. ఇందుకు తీవ్ర మనస్థాపానికి గురైన ఎల్లప్ప ఆదివారం గ్రామశివారులోని ఓ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. సమీప పొలాల రైతులు గమనించి వెంటనే అతడిని కిందకు దించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం

● పాల్గొన్న అశేష భక్తజనం



భారీ భక్తజనం నడుమ సంగమేశ్వరుడి రథోత్సవం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న కాలవ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామ సమీపంలో వేదావతి హగరి నదుల సంగమం ఒడ్డున సంగమేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు అక్కడి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి పూజలు, అర్చనలు జరిపి మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని రథోత్సవంలో ఉంచి ఊరేగించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, శివసాయిబాబా పాల్గొని రథాన్ని లాగారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, స్టోర్ డీలర్ సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ దేవన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం

బొమ్మనహాళ్: సంగమేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా స్థానిక టీడీపీ నాయకుడు బొంబాయి ఈరన్న ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం జరిగింది. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, శివసాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి యేటా రథోత్సవానికి వచ్చే భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు బొంబాయి ఈరన్న తెలిపారు.

నాగసముద్రంలో పెద్దకదిరప్ప స్వామి రథోత్సవం..



పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు: మండలంలోని నాగసముద్రం గ్రామంలో పెద్ద కదిరప్ప స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొని రథోత్సవాన్ని పారంభించారు. గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, పాల మల్లికార్జున, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి పాటుపడతా: ఎమ్మెల్యే గుమ్మనూరు



రామగిరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గుంతకల్లు నియోజకవర్గంలోని పల్లెల ప్రగతికి పాటుపడతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని రామగిరిలో ఆదివారం ఆయన టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయ్యాక పల్లెలు ప్రగతి బాట పట్టాయన్నారు. వైసీపీ హయాంలో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. ఎద్దులపల్లి, పాళ్యం, కత్రిమల గ్రామాలకు రోడ్లు వేశామని అన్నారు. రామగిరి గ్రామం రోడ్డుకు త్వరలోనే మరమ్మతులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, చెరువు సంఘం ప్రెసిడెంట్ సుదర్శన్‌బాబు ఎంపీటీసీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ వారికీ న్యాయం చేయండి

● ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

తాడిపత్రి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రావడానికి టీడీపీ, జనసేనతో సమానంగా కష్టపడ్డామనీ, బీజేపీ శ్రేణులకు న్యాయం చేయాలని ఆ పార్టీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజి నివాసంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. మూడు పార్టీలవారు కష్టపడి పనిచేయడంతోనే ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అందరికీ సమన్యాయం చేయాలన్నారు. వైసీపీ పాలనలో బీజేపీ నాయకులపై కేసులు పెట్టారన్నారు. పలువురు జైళ్లకు కూడా వెళ్లారన్నారు. ఇంత కష్టపడిన వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తమకు న్యాయం చేయడంలేదని తాడిపత్రి నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారన్నారు. కనీస గౌరవం దక్కట్లేదని వాపోయారన్నారు. అనంతపురంలో కూడా బీజేపీ నాయకులను ప్రభుత్వం పట్టించుకోలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కలిసి జనసేనతోపాటు బీజేపీ వారిని కూడా సమానంగా చూడాలని సూచించామన్నారు. సమావేశంలో నాయకులు అంకాల్‌రెడ్డి, గంగాధర్ యాదవ్, శింగరి లక్ష్మీనారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

● ముస్లింల డిమాండ్ ● పెద్దఎత్తున నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గుత్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని పట్టణంలోని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. నిజామి షాదీఖానా నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, రాజీవ్‌సర్కిల్, గాంధీ సర్కిల్ ర్యాలీకు కొనసాగింది. పలువురు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ఆస్తులను దెబ్బతీసేలా చట్టాలను తీసుకురావడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ముస్లిం హక్కులను కాపాడాలని, వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ గౌరవఅధ్యక్షులు మైనుద్దీన్, అన్వర్‌సాహెబ్, అధ్యక్షుడు సుంకం రఫీ, సహాయ కార్యదర్శి దస్తగిరి, సభ్యులు ఇస్మాయిల్, హుసేన్‌పీరా, నజీర్‌అహ్మద్, ఫయాజ్, మున్వర్, అన్వర్, అజీస్‌ఖాన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఉరవకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 2025-26వ విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా సాగింది. 5వతరగతి ప్రవేశం కోసం 554మంది దరఖాస్తు చేసుకోగా 488మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశం కోసం 388మంది దరఖాస్తు చేసుకోగా 332మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో ఈశ్వరయ్య తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని సింగానహళ్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు(30) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. రామాంజనేయులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలుచోట్ల ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈ నెల 10వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య వినోదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతలచెరువుకు చెందిన బోయ రామాంజనేయులు (49) భార్య అనారోగ్యంతో మంచానపడింది. అలాగే ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి అప్పులు అధికమయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన ఆదివారం ఇంటికి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అధికలోడుతో ప్రయాణిస్తే చర్యలు

పుట్లూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో ప్రయాణికులను అధికలోడుతో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సత్యబాబు హెచ్చరించారు. మండలంలోని కడవకల్లు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం అధికలోడుతో వెళ్లే వాహనాలకు అపరాధ రుసుం విధించినట్లు సీఐ తెలిపారు.

మే 4న ఉచిత ఖత్నా

రాయదుర్గం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అఙ్జుతుల్లా ఇస్లాం కమిటీ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించి మే 4వ తేదీన ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా నిర్వహించనున్నట్లు తీర్మానం చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ శర్మాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలతో పాటు రాయదుర్గం పట్టణానికి చెందిన పేద ముస్లిం బాలుర కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు దరఖాస్తు రుసుము రూ. 50 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న మసీద్‌ల ముతువల్లీల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ.కొత్తపల్లి గ్రామశివారులో గల 67వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. యాడికి మండలం కోన ఉప్పలపాడుకు చెందిన నరేష్, రామాంజనమ్మ బైక్‌పై గుత్తి సమీపంలోని బాటసుంకులమ్మ ఆలయానికి బయలుదేరారు. టీ.కొత్తపల్లి గ్రామశివారులోకి రాగానే వెనుక నుంచి మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో నరేష్, రామాంజనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత నరేష్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యాన రైతులకు అపార నష్టం

● ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

బెళుగుప్ప, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ఉద్యానవన పంటలు నేలకొరిగి ఆయా రైతులకు అపారనష్టం వాటిల్లింది. చేతికొస్తున్న మొక్కజొన్న, అరటి పంటలన్నీ నేలకు ఒరగడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టు మిట్టాడుతున్నారు. మండలంలో సుమారు 520 ఎకరాలలో మొక్కజొన్న, వంద ఎకరాలలో అరటి, పది ఎకరాలలో బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లింది. బాధిత రైతులు ఆదుకోవాలంటూ వ్యవసాయాధికారులకు అర్జీలు సమర్పిస్తున్నారు. గతంలో అకాల వర్షాలతో పంటనష్టం జరిగినా.. ప్రభుత్వాల నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదని, చేతికొచ్చిన పంటలు అందక నష్టాలు మూటగట్టుకున్నామని, ఈ ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆశలన్నీ అడియాసలయ్యాయి: జీవరత్నం, బెళుగుప్ప



ఎంతో కష్టపడి ఐదు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా. మంచి దిగుబడి వచ్చింది. కష్టాలన్నీ తీరుతాయని ఎంతో ఆశతో వుండగా ప్రకృతి కన్నెర్ర చేసింది. దీంతో చేతికొచ్చిన పంట నేలపాలైంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

మండలవ్యాప్తంగా వడగండ్ల వర్షం

బెళుగుప్ప: మండలంలో ఆదివారం వడగండ్ల వర్షం కురిసింది. బెళుగుప్ప, ఆవులెన్న, ఎర్రగుడి, అంకంపల్లి తదితర గ్రామాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ రైతులు ఊరట చెందారు. తేమశాతం తగ్గాక సేద్యపు పనులు చేపడతామని ఆ రైతులు పేర్కొన్నారు.



బెళుగుప్పలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

రగ్బీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జయన్న

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):రగ్బీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యువశక్తి కంప్యూటర్‌శిక్షణ సంస్థ డెరెక్టర్ టీ జయన్న నియమితులయ్యారు. రగ్బీ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఈ ఎన్నిక జరిపారు. ఈసందర్భంగా జయన్న మాట్లాడుతూ.. రగ్బీ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా పార్వేటోత్సవం



పార్వేట ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కూడేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పార్వేటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కుమ్మరివారి సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం ఆలయంలోని జోడులింగాలకు వివిధ రకాల అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. రాత్రికి పార్వేట, పరుష కావడంతో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. పార్వేటలో భాగంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తిని అశ్వ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలతో వేటకు బయలుదేరే సన్నివేశాన్ని నిర్వహించారు. ఆ సమయంలో టెంకాయ విసిరే కార్యక్రమం చేపట్టగా.. దానిని దక్కించుకోవడానికి భక్తులు భారీగా పోటీ పడ్డారు. ఆ టెంకాయ దక్కించుకున్న వారి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సుఖశాంతులు కలుగుతాయని, పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. ఎటువంటి సంఘటనలు జరగకుండా సీఐ రాజు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈఓ బాబు, సేవా కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఉచితంగా లడ్డూల పంపిణీ



భక్తులకు లడ్డూలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సంగమేశ్వరస్వామి పార్వేట, పరుష కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు నూతన రథ సేవా కమిటీ వారు ఉచితంగా లడ్డూలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎన్నడూలేని విధంగా ఉచిత లడ్డూలను నూతన రథ కమిటీ వారు పంపిణీ చేశారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో 1992వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు ఒక్కటిగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత నాటి ఉపాధ్యాయులు చలపతి, రామకృష్ణప్ప, బాబాఫకృద్దీన్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక జేసీ దివాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సరదాగా గడిపారు. తమతో పాటు విద్యనభ్యసించి మృతిచెందిన స్నేహితుల కుటుంబాలకు విరుపాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌పీరా రూ.30వేలు, పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే అనిల్ రూ.20వేలు, రాజేశ్వరమ్మ రూ.20వేలు పాఠశాల అభివృద్ధి కోసం ఖర్చుచేయనున్నట్లు తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందనలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ హెచ్. సింహాద్రి జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని నువాన్ జిల్లాలో ఉన్న పెహల్గాం ప్రాంతంలో పర్వతారోహణకు అర్హత సాధించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ తెలిపారు. ఇందుకు ఆదివారం కళాశాలలో అతడిని అందరూ అభినందించారు.

ఉచిత వివాహాలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగసముద్రం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం పురస్కరించుకుని ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి విశ్వనాథ్, నాగమణి దంపతులు ఉచిత వివాహాలను జరిపించారు. ఈసందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ 12 జంటలకు వివాహాలు జరిపించామన్నారు. నాయకులు గుర్రంసూర్యనారాయణ, చంద్రశేఖర్, బాబయ్య పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ ఎన్నిక

కణేకల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఈద్గామైదానంలో ముస్లిం మతపెద్దలు సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా హనుమాపురం బషీర్‌అహ్మద్, ఉపాధ్యక్షులుగా ఆఫ్షాన్ చిన్న ఫకృద్దీన్, ఉరవకొండ మొబైల్ బాషా, కార్యదర్శిగా జక్రియతో పాటు పలువురిని సహాయ కార్యదర్శులుగా, కార్యవర్గసభ్యులుగా, గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలికి తప్పిన ప్రమాదం

గుత్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియా బేగం ఆదివారం తిరుపతి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. తిరుపతి నుంచి ఆమె కారులో నెల్లూరుకు బయలుదేరారు. కొద్దిదూరం రాగానే కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. కారులో ఎయిర్ బ్యాగ్ ఓపెన్ కావడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. కాలికి గాయం కావడంతో తిరుపతి సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు భర్త రియాజ్ తెలిపారు.

21న ప్రవేశ పరీక్ష

పుట్లూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశపరీక్ష ఈనెల 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 122 మంది ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు గమనించి విద్యార్థుల హాజరయ్యేలా చూడాలని కోరారు.

ఘనంగా మట్టల పండుగ

గుత్తి/ పెద్దవడుగూరు ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఈత మట్టలతో ర్యాలీ చేశారు. తర్వాత చర్చిలో వాటిని ఉంచి ప్రార్థనలు చేశారు. అలాగే పెద్దవడుగూరులోని ఐఎస్ఈసీ చర్చిలోనూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మలయనూరులో ఉట్లమానోత్సవం

కుందుర్పి, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలయనూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉట్లమాను ఉత్సవం కోలాహలంగా సాగింది. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. చివరికి పరమేష్ అని యువకుడు ఉట్లమాను ఎక్కాడు. అతడిని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు నూతన వస్త్రాలను అందజేసి ఊరేగించారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



ప్రభాకర్ (ఫైల్)

కుందుర్పి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుద్దేకుంటకు చెందిన వృద్ధుడు ప్రభాకర్ కనిపించడం లేదంటూ ఫిర్యాదు వచ్చినట్లు ఆదివారం హెచ్‌సీ బాల నరసింహులు తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని, పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించ లేదని అతడి కుమారుడు లోకేష్ తెలపడంతో కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.